క్లుప్తంగా

నంద్యాల డిప్యూటీ ఈఓగా శంకర్‌ప్రసాద్



నంద్యాల(న్యూటౌన్): నంద్యాల డిప్యూటీ ఈఓగా డీటీ శంకర్‌ప్రసాద్‌ను ఎఫ్‌ఏసీగా నియమిస్తూ ఉన్నతాధికారుల ద్వారా ఉత్తర్వులు జారీ అయ్యాయని డీఈఓ జనార్దన్‌రెడ్డి మంగళవారం తెలిపారు. శిరివెళ్ల ఎంఈఓగా పని చేస్తున్న శంకర్‌ప్రసాద్‌ను నంద్యాల డిప్యూటీ డీఈఓగా నియమించడం జరిగిందన్నారు. అలాగే కోవెలకుంట్ల ఎంఈఓగా పని చేస్తున్న ఎస్.వెంకటరామిరెడ్డిని డోన్ డిప్యూటీ డీఈఓ ఎఫ్‌ఏసీగా నియమిస్తూ ఉత్తర్వులు అందాయని డీఈఓ తెలిపారు.

కళాశాలలో ఓపెన్ డే



యర్రగుంట్ల డిగ్రీ కళాశాలలో సదుపాయాలను వివరిస్తున్న వైస్ ప్రిన్సిపాల్

శిరివెళ్ల: యర్రగుంట్ల జీటీఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో మంగళవారం చుట్టుపక్క ప్రాంతాల జూనియర్ కాలేజీ విద్యార్థులకు ఓపెన్‌డే కార్యక్రమం నిర్వహించారు. కళాశాలలోని సదుపాయాలను వైస్ ప్రిన్సిపాల్ శ్రీనివాసుల రెడ్డి వివరించారు. 2025–26 విద్యా సంవత్సరానికి కళాశాలలో విద్యార్థుల అడ్మిషన్ల పెంపునకు కృషి చేస్తున్నామన్నారు. కంప్యూటర్ ల్యాబ్, సైన్స్ ల్యాబ్, జేకే నాలెడ్జ్ సెంటర్, జాబ్ మేళా, క్రీడలు తదితర సౌకర్యాలున్నాయన్నారు.

జంబులా పరమేశ్వరికి ప్రత్యేక పూజలు



రుద్రవరం: మండల కేంద్రం సమీపంలో కొలువైన జంబులా పరమేశ్వరి అమ్మవారికి మంగళవారం భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. ప్రతి ఏటా జంబులమ్మ పౌర్ణమి నాడు అమ్మవారికి విశేష పూజలు నిర్వహించడం ఆనవాయితీ. ఇందులో భాగంగా రుద్రవరం చాకలిపేటలోని ఆలయంలో కొలువైన అమ్మవారి ఉత్సవమూర్తిని ఉదయాన్నే గ్రామోత్సవంగా గ్రామ సమీపంలోని ఆలయానికి తీసుకెళ్లి అక్కడ కొలువుదీర్చారు. స్థానికులతో పాటు వివిధ ప్రాంతాల నుంచి తరలి వచ్చిన భక్తులు అమ్మవారికి పూజలు చేసి తమ మొక్కులు తీర్చుకున్నారు.

మాట నిలబెట్టుకోవాలి

నంద్యాల(న్యూటౌన్): ఎన్నికల ముందు విద్యార్థులకు ఇచ్చిన మాటను మంత్రి నారా లోకేష్ నిలబెట్టుకోవాలని ఎస్‌ఎఫ్‌ఐ రాష్ట్ర యూనివర్సిటీల కో కన్వీనర్, నంద్యాల జిల్లా ప్రధాన కార్యదర్శి ఎంఆర్ నాయక్ అన్నారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ ఎన్నికల ముందు పీజీ సెట్‌ల నిర్వహణ గురించి ఇచ్చిన హామీని నిలబెట్టుకోకపోవడం సిగ్గుచేటన్నారు. 2024 ఎన్నికల్లో ఉమ్మడి పీజీ అడ్మిషన్లను రద్దు చేసి యూనివర్సిటీలే ప్రవేశాలు చేపట్టే విధంగా చర్యలు తీసుకుంటానని నారా లోకేష్ హామీ ఇచ్చారని గుర్తు చేశారు. అయితే ఈనెల 8వ తేదీన వివిధ కోర్సులకు సంబంధించిన ప్రవేశాలను నోటిఫికేషన్ విడుదల చేశారన్నారు. అందులో పీజీసెట్ ఉమ్మడిగానే ఉందని చెప్పారు.

ఉపాధి కూలీల సంఖ్య పెంచండి



ఉపాధి సిబ్బందికి సూచనలిస్తున్న ఏపీడీ

రుద్రవరం: మండలంలో ఉపాధి కూలీల సంఖ్య పెంచాలని ఏపీడీ సాంబశివుడు సూచించారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో మంగళవారం ఆయన ఉపాధి హామీ పథకం సిబ్బందితో సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ కూలీల సంఖ్య పెంచడంతో పాటు తగిన పనులను వెంటనే గుర్తించాలన్నారు. ఎంపీడీఓ భాగ్యలక్ష్మి, ఏపీఓ ప్రతాప్ తదితరులు ఉన్నారు.

శనగలో పంటకోత ప్రయోగం

దొర్నిపాడు: మండలకేంద్రంలోని సునీత, చైతన్య కుమారిలకు సంబంధించిన శనగ పంటలో మంగళవారం ప్లానింగ్ డిపార్ట్‌మెంట్ ఏడీ ఓబులేసు ఆధ్వర్యంలో పంటకోత ప్రయోగం చేశారు. మాట్లాడుతూ.. చుట్టూ ఐదు మీటర్ల కొలతలో శనగ పంటను సేకరించి తూకం వేయగా ఎకరానికి 6.47 క్వింటాళ్ల దిగుబడులు వచ్చినట్లు చెప్పారు. కార్యక్రమంలో మండల వ్యవసాయాధికారి ప్రమీల, ఏఎస్ఓ రామిరెడ్డి, వీఆర్ఓ నాగేష్ తదితరులు పాల్గొన్నారు.

ఎల్ఐసీలో పోస్టులు భర్తీ చేయాలి

నంద్యాల(న్యూటౌన్): ఎల్ఐసీలో కేవలం ఈ ఆర్థిక సంవత్సరం 9 నెలల్లోనే 3,130 మంది క్లాస్ 3, 4 తరగతుల్లో సిబ్బంది తగ్గారని, పాలసీ దారులకు మెరుగైన సేవలు అందించేందుకు నూతన నియామకాలు చేపట్టాలని ఎల్ఐసీ ఉద్యోగుల సంఘం యూనియన్ ప్రధాన కార్యదర్శి రఘునాథరెడ్డి, నంద్యాల కార్యదర్శి రమేష్‌బాబు డిమాండ్ చేశారు. మంగళవారం దేశ వ్యాప్త పిలుపు మేరకు నిరసన కార్యక్రమాన్ని నిర్వహించారు. తక్షణం ఆయా క్యాడర్లలో రిక్రూట్‌మెంట్ చేపట్టాలని డిమాండ్ చేశారు. అనంతరం బ్రాంచ్ మేనేజర్ శివశంకర్‌కు వినతి పత్రం అందజేశారు.

శివానుగ్రహం

- నంద్యాలలో శివదీక్ష, ఇతర మాలధారులకు 24ఏళ్లుగా అన్నదానం
- రోజుకు 800 మందికి పైగా భిక్ష స్వీకరణ
- 12 రకాల వంటకాల వడ్డింపు
- ఏటేటా పెరుగుతున్న మాలధారులు



భిక్ష స్వీకరిస్తున్న శివస్వాములు

నంద్యాల(వ్యవసాయం): నంద్యాల భక్తి వేదాంత ఆధ్యాత్మిక ప్రవచనాలకు, భక్తి భరిత సేవా కార్యకలాపాలకు కేంద్రం. ఆధ్యాత్మిక సేవలో భాగంగా పట్టణంలోని గుడిపాటిగడ్డలో వెలసిన భ్రమరాంబికా మల్లికార్జునస్వామి దేవస్థానంలో 24 ఏళ్లుగా ప్రతి ఏటా మాఘమాసంలో శివమాల, ఇతర దీక్ష ధారులకు భిక్ష (అన్నదానం) నిర్వహిస్తున్నారు. నాడు వందమందితో అన్నదాన కార్యక్రమం ప్రారంభించగా నేడు 800 మందికి పైగా అక్కడ భిక్ష స్వీకరిస్తున్నారు.

2002లో ప్రారంభం..

పట్టణంలోని గుడిపాటిగడ్డలో వెలసిన శ్రీభ్రమరాంబికా మల్లికార్జునస్వామి దేవస్థానంలో 2002 సంవత్సరంలో అన్నదాన కార్యక్రమం ప్రారంభించారు. అన్నదాన కమిటీ సభ్యులు గుడిపాటి ప్రసాద్, సంఘు శివయ్య, మిద్దె సుబ్బయ్య ప్రతిరోజూ 100మందికి అన్నదాన కార్యక్రమం నిర్వహిస్తుండేవారు. నేడు ప్రతిరోజూ 800మందికి పైగా భిక్ష అందిస్తున్నారు. దివంగత ఎంపీ ఎస్పీవై రెడ్డి సహకారంతో 24ఏళ్ల క్రితం అన్నదాన మండపాన్ని నిర్మించారు. అందులోనే అయ్యప్పస్వాములు, శివస్వాములకు అన్నదాన కార్యక్రమం కొనసాగిస్తున్నారు.

రోజూ 12 రకాల వంటకాలు

మాఘమాసం మొదలుకొని శివరాత్రి వరకు మధ్యాహ్నం 12రకాల వంటకాలతో అన్నదాన కార్యక్రమాన్ని ఏర్పాటు చేస్తున్నారు. ఈ భిక్ష కార్యక్రమానికి పట్టణంతో పాటు చుట్టుపక్కల గ్రామీణ ప్రాంతాల వారు, ఇతర జిల్లాల నుంచి వచ్చే భక్తులు వినియోగించుకుంటున్నారు. భక్తులు మల్లికార్జునస్వామి దేవస్థానంలో పూజలు, భిక్ష కార్యక్రమాలు చేసుకొని అక్కడే బసను ఏర్పాటు చేసుకుంటారు. వారికి తోచినంత డబ్బు హుండీలో వేయడం లేదా అన్నదాన కమిటీ సభ్యులకు అందజేస్తుంటారు. దీని వల్ల ఎక్కువ మందికి భిక్షను ఏర్పాటు చేసే అవకాశం ఏర్పడుతుంది. గురుస్వామి లింగమూర్తి ఆధ్వర్యంలో ప్రతిరోజూ ఉదయమే మల్లికార్జునస్వామి వారికి ప్రత్యేక పూజలు నిర్వహించి అన్నదానాన్ని ప్రారంభిస్తారు. సాయంత్రం భజనలు, సత్సంగం నిర్వహిస్తుంటారు.

దాతల సహకారంతో..

అన్నదానానికి శాశ్వత దాతల సహకారం ఎంతో ఉంది. వీరి పేర్ల మీద ఒక్కొక్క రోజు అన్నదాన సమయంలో పూజలు నిర్వహిస్తారు. ఒక్కరోజు భిక్ష కార్యక్రమానికి రూ.8వేలు అందజేస్తే దాతల పేర్ల మీద ప్రత్యేకంగా పూజలు నిర్వహిస్తారు. ప్రతిసంవత్సరం దాతల సహకారం పెరుగుతూ వస్తుండటంతో పాటు మాలధారుల సంఖ్య కూడా పెరుగుతోంది. ఇతర ప్రాంత వాసులు కూడా ఇక్కడ అన్నదానానికి సహకరిస్తున్నారు. పట్టణ వాసులు, గ్రామీణ వాసులు బియ్యం, పప్పులు, వంటసామగ్రి చేతనైనంత సహాయం చేస్తున్నారు. అన్నదాన కార్యక్రమానికి ప్రతిరోజూ రూ.25వేల నుంచి రూ.30వేలు ఖర్చు అవుతుందని అన్నదాన కమిటీ సభ్యులు తెలిపారు. అన్నదానం ద్వారా వచ్చిన విరాళాలను 41రోజుల పాటు భోజన కార్యక్రమాలకు వినియోగించి.. మిగిలిన నగదును దేవస్థానం మరమ్మతులు, అభివృద్ధి కోసం ఖర్చు చేస్తారు.



పూజలందుకుంటున్న మల్లికార్జునస్వామి

మాల ధరించినప్పుడల్లా నంద్యాలకు వస్తుంటా



మాది శిరివెళ్ల గ్రామం. ఆరేళ్ల నుంచి మాల ధరించినప్పుడల్లా నంద్యాలకు వచ్చి ఇతర పనులు ముగించుకొని హోటళ్లకు వెళ్లకుండా మల్లికార్జునస్వామి దేవాలయానికి వచ్చి పూజలు చేసుకొని, ఇక్కడే భిక్ష, వీలైతే రాత్రి సమయాల్లో బస చేస్తుంటాను. ఇంట్లో వసతి లేనప్పుడు కూడా అన్నదాన కమిటీ వారు ఏర్పాటు చేసిన గదులలోనే ఉంటా.

– పత్తి విజయ్‌కుమార్, శివమాలధారుడు

27 ఏళ్లుగా దీక్ష చేపడుతూనే ఉన్నా



గత 27ఏళ్లుగా శివ దీక్షను స్వీకరిస్తున్నా. ప్రతి సంవత్సరం శివదీక్ష స్వాముల సంఖ్య పెరుగుతూనే ఉంది. నంద్యాల పట్టణంలో దాదాపు 10వేల మంది శివదీక్ష తీసుకున్నారు. ఈ దీక్షల వల్ల మానసిక ప్రశాంతత, దైవచింతన, సమాజసేవ, స్నేహ బంధాలు పెరుగుతాయి.

–అరిగెల లింగమూర్తి, గురుస్వామి, నంద్యాల

దాతల సహకారం మరువలేనిది



శివమాల దీక్షధారులతో పాటు ఇతర రకాల మాలాధారులకు గత 24ఏళ్ల నుంచి దాతల సహకారంతో అన్నదానం కొనసాగుతోంది. వివిధ పనుల నిమిత్తం శివస్వాములు ఆర్థాకలితో భిక్ష కోసం ఇబ్బంది పడకుండా ఉండేందుకు ప్రతిరోజు 800మందికి పైగానే ఇక్కడకు వచ్చి పూజలు నిర్వహించుకొని భిక్ష స్వీకరించడం చాలా సంతోషదాయకం. దాతల సహకారంతోనే ఈ కార్యక్రమం కొనసాగుతోంది.

– మిద్దె సుబ్బయ్య, అన్నదాన కమిటీ అధ్యక్షుడు

పాఠశాలను విలీనం చేయొద్దు

- విద్యార్థుల తల్లిదండ్రుల ఆందోళన



పాఠశాల వద్ద ఆందోళన చేస్తున్న విద్యార్థుల తల్లిదండ్రులు

దొర్నిపాడు: ప్రస్తుతమున్న పాఠశాలలోనే తమ పిల్లలకు పాఠాలు బోధించాలని గ్రామంలోనే ఉన్న మరో పాఠశాలలోకి విలీనం చేయరాదని స్థానిక ఎంపీపీ స్పెషల్ స్కూల్ విద్యార్థుల తల్లిదండ్రులు శివకోటి, బ్రహ్మం, మాధవయ్య ఎస్ఎంసీ చైర్మన్ గురువయ్య మంగళవారం ఆందోళన వ్యక్తం చేశారు. ఎస్సీ కాలనీలో ఉండే 3, 4, 5 తరగతులను అదే గ్రామంలోని ఎంపీపీ మెయిన్(కోట) స్కూల్లో విలీనం చేయాలని ప్రభుత్వం నుంచి ఉత్తర్వులు వచ్చినట్లు తెలియడంతో కాలనీవాసులు పాఠశాల ఎదుట ధర్నా నిర్వహించారు. ఎన్నో ఏళ్లుగా తమ కాలనీలో స్కూల్ ఉందని ప్రైవేటు బడులకు పంపకుండా పిల్లలను ఇక్కడే చదివిస్తున్నట్లు పేర్కొన్నారు. అన్ని వసతులు కలిగి 86 మంది పిల్లలతో ఉన్న మా బడిని విలీనం చేస్తే ఊరుకోమన్నారు. ఉపాధ్యాయుల సర్దుబాటు పేరుతో ఇలా చేయడం సరికాదన్నారు. అధికారులు, ప్రజా ప్రతినిధులు స్పందించి తమ బడిని విలీనం చేయకుండా కాపాడాలని మండల విద్యాధికారి–2 రామచంద్రయ్యకు వినతిపత్రం అందజేశారు.

రైతు గుర్తింపు సంఖ్యతో సులభంగా సేవలు



రైతులకు అవగాహన కల్పిస్తున్న ఏఓ స్వప్నికారెడ్డి

నంద్యాల(అర్బన్): భూమి ఉన్న ప్రతి రైతుకు 11 అంకెల ప్రత్యేక గుర్తింపు సంఖ్యను ఇవ్వడం ద్వారా వ్యవసాయ సేవలను సులభతరం, పారదర్శకంగా అందించవచ్చని ఏఓ ప్రసాదరావు తెలిపారు. రైతు సంక్షేమ మంత్రిత్వ శాఖ, భారత ప్రభుత్వం సమన్వయంతో రాష్ట్ర వ్యవసాయ శాఖ చేపడుతున్న బృహత్తర కార్యక్రమం రైతు గుర్తింపు సంఖ్య అని అన్నారు. పొలం పిలుస్తోంది కార్యక్రమంలో భాగంగా మంగళవారం నంద్యాల మండలం పులిమద్ది, భీమవరం గ్రామంలో రైతుల సమావేశం నిర్వహించి యూనిక్ ఐడీపై అవగాహన కల్పించారు.

గోస్పాడు: రైతులకు ఆధార్ తరహాలో ప్రత్యేక గుర్తింపు కార్డును ప్రభుత్వం ఇవ్వనున్నట్లు వ్యవసాయాధికారి స్వప్నికారెడ్డి తెలిపారు. మండలంలోని కానాలపల్లె గ్రామంలో మంగళవారం పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని నిర్వహించి రైతులకు ఆన్‌లైన్ గుర్తింపు నంబరుపై అవగాహన కల్పించారు.

దొర్నిపాడు: ప్రతి రైతుకు 11 నంబర్లతో యూనిక్‌కోడ్(యూసీ) కేటాయించనున్నట్లు ఏఓ ప్రమీల మంగళవారం తెలిపారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలకు సంబంధించిన పథకాలు పొందాలంటే భూ యజమానులు ఫార్మర్ రిజిస్ట్రీ నమోదు చేసుకోవాలన్నారు.

వైఎస్ జగన్‌ను విమర్శించే స్థాయి లేదు



వైఎస్సార్‌సీపీ నాయకుడు భూమా కిషోర్‌రెడ్డి

ఆళ్లగడ్డ : మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని విమర్శించే స్థాయి ఎమ్మెల్యే అఖిలప్రియకు లేదని వైఎస్సార్‌సీపీ నాయకుడు భూమా కిషోర్‌రెడ్డి అన్నారు. స్థానిక కార్యాలయంలో మంగళవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ టీడీపీ ప్రభుత్వం బీసీ రుణాలు ఇస్తున్నామని ప్రగల్భాలు పలుకుతోందని, నియోజకవర్గం అంతా కలుపుకున్నా కనీసం 400 మంది లబ్ధిదారులకు కూడా ఇవ్వలేని దుస్థితి ఉందన్నారు. ఈ రుణాలు బినామీలకు కాకుండా అర్హులైన వారికే అందించాలని డిమాండ్ చేశారు. రామలక్ష్మి కొట్టాలలో ఉన్న ప్రభుత్వ అంగన్‌వాడీ కేంద్రాన్ని కూల్చి వేసి, కబ్జాచేసి టీడీపీ నాయకులు కట్టుకుంటున్న బిల్డింగులు తాము అధికారంలోకి వచ్చిన వెంటనే కూల్చి వేస్తామన్నారు. ఎమ్మెల్యే ప్రవర్తనతో ఆళ్లగడ్డ ప్రజలు విసిగిపోయారన్నారు. వారి కంటే అరచాకాలు, దౌర్జన్యాలు చేసేవారు ఎవరూ ఉండరన్నారు.

విద్యార్థులు ఉన్నత లక్ష్యాలను సాధించాలి



రిటైర్డు ప్రిన్సిపాల్‌ను సన్మానిస్తున్న దృశ్యం

నంద్యాల(న్యూటౌన్): విద్యార్థులు ఉన్నత లక్ష్యాలను సాధించి కళాశాలకు, తల్లిదండ్రులకు మంచి పేరు తీసుకొని రావాలని రిటైర్డు ప్రిన్సిపాల్ రామయ్య అన్నారు. మంగళవారం నంద్యాల పట్టణంలోని భువన విజయం జూనియర్ కళాశాలలో ఘనంగా ఆయన వీడ్కోలు కార్యక్రమాన్ని నిర్వహించారు. భువన విజయం కళాశాల డైరెక్టర్ కౌసర్‌బాషా, ప్రిన్సిపాల్ సీసీ వెంకటసుబ్బయ్య అధ్యక్షతన వీడ్కోలు సభను నిర్వహించారు. విద్యార్థుల సంస్కృతిక కార్యక్రమాలు పలువురిని అలరించాయి. కార్యక్రమంలో కళాశాల ఏఓ కౌసర్, అధ్యాపకులు కృష్ణవేణి, మల్లికార్జున, శేఖర్, తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి



నాగేంద్ర(ఫైల్)

దొర్నిపాడు: మండల కేంద్రానికి చెందిన నాగేంద్ర(32) అనే యువకుడు ఆళ్లగడ్డ మండలం చింతకుంట వద్ద సోమవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో దుర్మరణం చెందాడు. ఎస్ఐ నగీన తెలిపిన మేరకు వివరాలు.. నాగేంద్ర పనుల నిమిత్తం చింతకుంటకు వచ్చి తిరిగి ద్విచక్రవాహనంపై వెళ్తూ గ్రామ శివారులో ప్రధాన రహదారిపై ఉన్న ట్రాక్టర్‌ను ఢీ కొట్టాడు. ఈ ప్రమాదంలో తీవ్రంగా గాయపడ్డ నాగేంద్ర అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడికి భార్య లక్ష్మితో పాటు సాయి, గౌతమ్ ఇద్దరు పిల్లలు ఉన్నారు. ఇదిలా ఉండగా చిన్నకుమారుడు గౌతమ్‌కు చెన్నైలో బ్రెయిన్ ఆపరేషన్ చేయించేందుకు ఏర్పాట్లు చేసుకున్నాక ఈ ప్రమాదం జరగడంతో కుటుంబ సభ్యుల రోదనలు మిన్నంటాయి.

మాలల యుద్ధ గర్జనకు తరలిరండి

నంద్యాల(అర్బన్): ఎస్సీ వర్గీకరణకు వ్యతిరేకంగా ఈనెల 23న కర్నూలు ఎస్టీబీసీ కళాశాల ఆవరణలో నిర్వహించతలపెట్టిన రాయలసీమ మాలల యుద్ధ గర్జనకు మాలలు లక్షలాదిగా తరలి రావాలని దళిత మహాసభ జాతీయ అధ్యక్షుడు మల్లెల వెంకటరావు పిలుపునిచ్చారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయ ఆవరణలోని నిశాంత్ భవన్ ఆవరణలో మంగళవారం మాలమహానాడు జాయింట్ యాక్షన్ కమిటీ సమావేశం నిర్వహించారు. మాల మహానాడు రాష్ట్ర గౌరవాధ్యక్షుడు మేకల లింగస్వామి ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో రిజర్వేషన్ ఫలాలు షెడ్యూల్ కులాల అభ్యున్నతికి దూరం చేయాలని మనువాదులు కుట్ర చేస్తున్నారన్నారు. వర్గీకరణకు వ్యతిరేకంగా పోరాడాల్సిన సమయం ఆసన్నమైందన్నారు. మేకల లింగస్వామి, నాయకులు వెంకటేశ్వర్లు, రాజశేఖర్, సునీల్, దస్తగిరి, రాజేంద్ర తదితరులు పాల్గొన్నారు.

దళితులను అణగదొక్కే యత్నం

రాష్ట్ర డిప్యూటీ స్పీకర్ రఘురామ కృష్ణంరాజు అగ్రకుల అహంకారంతో దళిత అధికారులు, కుటుంబాలను అణగదొక్కే ప్రయత్నం చేస్తున్నారని అంబేడ్కర్ ఇండియా మిషన్ రాయలసీమ జోనల్ ఇన్‌చార్జ్ శోభన్ బాబు ఆరోపించారు. మంగళవారం పట్టణంలో మిషన్ ముఖ్యనేతల సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ రఘురామకృష్ణం రాజు దళిత ద్రోహి అని, దళితులపై కక్ష సాధింపే ఆయన అజెండా అన్నారు. తెలంగాణ రాష్ట్రానికి చెందిన మాజీ ఐపీఎస్ అధికారి ప్రవీణ్‌కుమార్‌పై అనుచిత వ్యాఖ్యలు చేయడంతో పాటు ఏపీలో దళిత అధికారులను టార్గెట్ చేసి వేధిస్తున్నారన్నారు.

15న ఆలయ షాపుల బహిరంగ వేలం

నంద్యాల(వ్యవసాయం): ఈనెల 15వ తేదీన పట్టణంలోని శ్రీకాళికాంబా చంద్రశేఖరస్వామి దేవస్థానానికి చెందిన షాపుల అద్దెకు బహిరంగ వేలం నిర్వహిస్తున్నట్లు ఆలయ ఈఓ లక్ష్మీనారాయణ మంగళవారం తెలిపారు. ఆయన మాట్లాడుతూ ఆలయానికి చెందిన 5 షాపులను మూడు సంవత్సరాలకు (ఈ ఏడాది మార్చి 1 నుంచి 2028 ఫిబ్రవరి 28వ తేదీ వరకు)గాను వేలం పాటలు నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు.

పరిశుభ్రతపై అవగాహన కల్పించాలి

ఉయ్యాలవాడ : గ్రామాలను పరిశుభ్రంగా వుంచుకునేలా ప్రజలకు అవగాహన కల్పించాలని ఎంపీడీఓ ఉమామహేశ్వరరావు సూచించారు. మంగళవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులు, ఇంజినీరింగ్ అసిస్టెంట్లతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. గ్రామంలోని ప్రధాన కాలువల ద్వారా మురుగునీరు, వృథా నీటిని బయటకు పంపేందుకు గ్రామ శివార్లలో డంపింగ్ యార్డ్‌లను ఏర్పాటు చేయాలన్నారు. ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ ఫణీత్ కృష్ణ మాట్లాడుతూ గ్రామాలల్లోని చేతి బోర్లలో ఏదైనా సమస్యలు వుంటే గుర్తించాలన్నారు. కార్యక్రమంలో ఈఓపీఆర్‌డీ వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

బయోమెట్రిక్ హాజరు తప్పని సరి

శిరివెళ్ల: గ్రామ సచివాలయాలలో బయోమెట్రిక్ హాజరు తప్పనిసరి అని ఎంపీడీఓ శివమల్లేశ్వరప్ప అన్నారు. మంగళవారం గ్రామ పంచాయతీలు, సచివాలయాల సిబ్బందితో సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ కొంత మంది సిబ్బంది హాజరుపై నిర్లక్ష్యం వహిస్తున్నారన్నారు. ఉదయం 10 గంటలకు, మధ్యాహ్నం 5 గంటలకు విధిగా బయోమెట్రిక్ వేయాలన్నారు. వేసవిలో నీటి ఎద్దడి తలెత్తకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని, 15వ ఆర్థిక సంఘం నిధులను వినియోగించాలని కార్యదర్శులను ఆదేశించారు. కార్యక్రమంలో ఈఓఆర్డీ శ్రీనివాసశర్మ, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ త్రిలేంగేశ్వరరెడ్డి, పీఆర్ ఏఈ రవికుమార్ పాల్గొన్నారు.

సర్వేలు సక్రమంగా నిర్వహించండి

ఉయ్యాలవాడ : గ్రామ సచివాలయాల పరిధిలో చేపట్టిన సర్వేలు సక్రమంగా నిర్వహించాలని ఎంపీడీఓ ఉమామహేశ్వరరావు సిబ్బందిని ఆదేశించారు. మండలంలోని మాయలూరు, అల్లూరు గ్రామ సచివాలయాలను మంగళవారం సందర్శించారు. ఆయన మాట్లాడుతూ ఎస్‌పీసీఐ లింక్, హౌస్‌హోల్డ్ జియోట్యాగింగ్, ఆధార్ అప్‌డేషన్, ఇలా 11 శాఖల సంబంధించి వివరాలను సర్వే చేస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శులు హుసేన్‌బీ, అబ్దుల్‌రహిమాన్ పాల్గొన్నారు.

ఈ-శ్రామ్ కార్డును తీసుకోవాలి

నంద్యాల(అర్బన్): ప్రతి చిరువ్యాపారి ఈ–శ్రామ్ కార్డు తప్పని సరిగా తీసుకోవాలని అసిస్టెంట్ లేబర్ కమిషనర్ బసిరున్నిసా బేగం తెలిపారు. స్థానిక ఆల్ మదద్ కంప్యూటర్ సెంటర్‌లో మంగళవారం ఈ–శ్రామ్‌కార్డు అవసరంపై చిరువ్యాపారులకు అవగాహన సమావేశం నిర్వహించారు. సెంటర్‌లో ఈనెల 19న ఉచిత ఈ–శ్రామ్ నమోదు కార్యక్రమం నిర్వహిస్తున్నారని, జిల్లాలోని సంఘటిత, అసంఘటిత కార్మికులందరూ సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో చిరువ్యాపారుల సంక్షేమ సంఘం గౌరవాధ్యక్షులు రహీం, రహంతుల్లా, సత్యనారాయణ, సిద్దయ్య పాల్గొన్నారు.

కనీస వేతనం రూ.26వేలు ఇవ్వాలి

నంద్యాల(న్యూటౌన్): అంగన్‌వాడీలకు కనీస వేతనం రూ.26వేలు ఇవ్వాలని, గ్రాడ్యూటీ అమలు చేయాలని, పెరుగుతున్న ధరలకు అనుగుణంగా అంగన్‌వాడీ వర్కర్లకు వేతనాలు పెంచాలని, అంగన్ వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ జిల్లా గౌరవాధ్యక్షుడు ఏసురత్నం, జిల్లా కార్యదర్శి నిర్మల, సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు తోటమద్దులు డిమాండ్ చేశారు. మంగళవారం స్థానిక కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడుతూ సంక్షేమ పథకాలు అంగన్‌వాడీ వర్కర్లకు కూడా అమలు చేయాలన్నారు. అనంతరం ఐసీడీఎస్ సూపరింటెండెంట్ శమంతకమణికి వినతి పత్రాన్ని అందజేశారు. కార్యక్రమంలో ఏసురత్నం తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా అష్టాదళ పాదపద్మారాధన సేవ



అష్టాదళ పాదపద్మారాధన సేవలో వేంకటేశ్వరస్వామి

నంద్యాల(వ్యవసాయం): పట్టణంలోని సంజీవనగర్ రామాలయంలో వెలసిన లక్ష్మీవేంకటేశ్వరస్వామికి మాఘమాసాన్ని పురస్కరించుకొని మంగళవారం వేదపండితుల ఆధ్వర్యంలో అత్యంత వైభవంగా అష్టాదళ పాదపద్మారాధన సేవ నిర్వహించారు. స్వామి వారికి తెల్లవారుజామునే సుప్రభాత సేవ, పంచామృతాభిషేకాలు నిర్వహించి స్వామి వారిని పట్టువస్త్రాలచే అలంకరించారు. అనంతరం 108 బంగారు పుష్పాలచే స్వామి వారికి అష్టోత్తర నామావళి నిర్వహించారు. కార్యక్రమంలో వేదపండితుడు శ్రీకాంత్‌శర్మ, సూరయ్య, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు. అలాగే శ్రీకాళికాంబా చంద్రశేఖరస్వామి దేవస్థానంలో కాళికాంబదేవికి ఉదయాన్నే సుప్రభాతసేవ, పంచామృతాభిషేకాలు నిర్వహించి అమ్మవారికి పట్టువస్త్రాలు సమర్పించి ఒడి బియ్యం కార్యక్రమాన్ని నిర్వహించారు. అనంతరం 108 వెండి పుష్పాలచే అమ్మవారికి అష్టాదళ పాదపద్మారాధన సేవ కార్యక్రమాన్ని చేపట్టారు. కార్యక్రమంలో ఈఓ లక్ష్మీనారాయణ, వేదపండితులు రాఘవేంద్ర, మరణాచారి, ఆరవేటి వాసు, విజయ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో చండీ హోమం



చండీ హోమంలో పాల్గొన్న భక్తులు

నంద్యాల(వ్యవసాయం): పట్టణ శివారులోని జంబులాపరమేశ్వరి ఆలయంలో మంగళవారం అమ్మవారి తృణాల మహోత్సవం కనుల పండువగా ప్రారంభమైంది. ఉదయాన్నే అమ్మవారికి శ్రీసూక్త క్షీరాభిషేకం నిర్వహించి అనంతరం శారదా జ్యోతిష్య పీఠాధిపతి మాడుగుల నాగేంద్రశర్మ ఆధ్వర్యంలో శాస్త్రోక్తంగా చండీ హోమాన్ని నిర్వహించారు. ఆలయ నిర్వాహకులు గాండ్ల జగన్ మాట్లాడుతూ 12వ తేదీ బోనాల మహోత్సవం, అమ్మవారిని వెండి చీర అలంకరణ, అనంతరం అన్నదాన ప్రసాద వితరణ కార్యక్రమం నిర్వహిస్తారన్నారు. 13న గాడిదల పందేలు నిర్వహిస్తున్నట్లు వెల్లడించారు.

పాత్రికేయులను దూషించడం తగదు

నంద్యాల(న్యూటౌన్): పాత్రికేయులను సస్పెండ్ అయిన నంద్యాల సబ్ రిజిస్ట్రార్ అబ్దుల్‌సత్తార్ దూషించడం తగదని ఏపీయూడబ్ల్యూజే రాష్ట్ర అధ్యక్షుడు సుబ్బారావు అన్నారు. మంగళవారం రామకృష్ణ డిగ్రీ కళాశాల ఆడిటోరియంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. విలేకరులు అడిగిన ప్రశ్నలకు సమాధానం చెప్పకుండా సభ్యసమాజం తలదించుకునేలా దూషించడం తప్పని, ఇలాంటి చర్యలు పునరావృతం కాకుండా చూసుకోవాలన్నారు. సస్పెండ్ అయిన సబ్ రిజిస్ట్రార్ అబ్దుల్ సత్తార్ జర్నలిస్టులకు క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. సమావేశంలో ఏపీయూడబ్ల్యూజే నాయకులు చలంబాబు, ఉస్మాన్‌బాషా, మధు పాల్గొన్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

ఆళ్లగడ్డ : న్యాయ సహాయకుల (పారా లీగల్ వలంటీర్ల) నియామకానికి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ఆళ్లగడ్డ ఐదవ అదనపు జిల్లా జడ్జి మురళీకృష్ణ మంగళవారం తెలిపారు. పదవీ విరమణ పొందిన ఉపాధ్యాయులు, ఉద్యోగులు, వయో వృద్ధులు, విద్యార్థులు, అంగన్‌వాడీ కార్యకర్తలు, వైద్యులు, రాజకీయేతర సభ్యులు, సేవా దృక్పథం ఉన్న వారు, న్యాయ సంబంధిత విద్యార్థులు దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. పదో తరగతి పాసై ఉమ్మడి కర్నూలు జిల్లాకు చెందినవారై ఉండాలన్నారు. ఆసక్తి ఉన్న అభ్యర్థులు అవసరమైన ధ్రువీకరణ పత్రాలతో ఆళ్లగడ్డ మండల న్యాయసేవాధికారి సంఘం కార్యాలయం (కోర్టు) లో దరఖాస్తు చేసుకోవాలన్నారు.

అన్నపై తమ్ముడి దాడి

దొర్నిపాడు: ఇంటి స్థలం విషయంలో అన్నపై తమ్ముడు దాడికి పాల్పడిన ఘటన మంగళవారం దొర్నిపాడులో చోటుచేసుకుంది. ఏఎస్ఐ రంగయ్య తెలిపిన వివరాల మేరకు గ్రామంలో పెద్ద నరసింహుడు ఇంటి నిర్మాణం చేపడుతున్నాడు. అయితే ఆ స్థలం తనదంటూ పెద్దనరసింహుడు అన్న చిన్నపాములేటి వచ్చాడు. ఈ విషయంపై వాగ్వాదం చోటుచేసుకోగా అన్నపై తమ్ముడు దాడి చేశాడు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు చెప్పారు.

మద్దతు ధర కల్పించడంలో ప్రభుత్వం నిర్లక్ష్యం

నంద్యాల(న్యూటౌన్): పంటలకు మద్ద ధర కల్పించడంలో ప్రభుత్వం నిర్లక్ష్యం వ్యవహరిస్తోందని, తీవ్రంగా నష్టపోయిన జిల్లా రైతాంగాన్ని కూటమి ప్రభుత్వం ఆదుకోవాలని ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి రాజశేఖర్, జిల్లా ఉపాధ్యక్షుడు రామేశ్వరరావు, రామచంద్రుడు డిమాండ్ చేశారు. మంగళవారం స్థానిక సీపీఎం కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడుతూ జిల్లాలో ఎఫ్‌సీఐ, మార్క్‌ఫెడ్, నాఫెడ్ లాంటి సంస్థలతో ప్రభుత్వం కనీసం మద్దతు దిగుబడులు ధరకు కొనుగోలు చేయాలన్నారు. సమావేశంలో నాయకుడు సుబ్బరాయుడు, రైతులు పాల్గొన్నారు.

మున్సిపాలిటీలో అవినీతిని అరికట్టండి

నంద్యాల(న్యూటౌన్): మున్సిపాలిటీలో జరుగుతున్న అవినీతిని అరికట్టాలని మార్క్‌ఫెడ్ డైరెక్టర్ తులసిరెడ్డి అన్నారు. మంగళవారం స్థానిక మున్సిపల్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ మున్సిపాలిటీలో జరుగుతున్న అవినీతిపై సిట్ అధికారితో దర్యాప్తు చేయించాలన్నారు. వికలాంగులను దూషిస్తూ.. లంచం అడిగిన అధికారులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

అర్హులకే ఇంటి స్థలాలు

ఉయ్యాలవాడ : అర్హులైనవారికే ఇంటి స్థలాలు కేటాయించేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు తహసీల్దార్ శ్రీనివాసులు తెలిపారు. మంగళవారం స్థానిక రెవెన్యూ కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ గత ప్రభుత్వ హయాంలో ఇంటి స్థలాలు పొంది ఇంత వరకు నిర్మాణాలు చేపట్టకుండా ఉన్న లబ్ధిదారులను గుర్తించేందుకు తమ శాఖ ద్వారా సర్వేయర్, వీఆర్‌ఓలతో కలిసి బృందాలను ఏర్పాటు చేసి సర్వే చేయనున్నట్లు వెల్లడించారు. తమ సర్వేలో అనర్హులుగా తేలితే ఇంటి పట్టాలను కూడా రద్దు చేస్తామన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ ప్రసాద్‌బాబు ఉన్నారు.

ఇళ్ల స్థలాలపై సర్వే చేయండి

శిరివెళ్ల: ఇళ్ల స్థలాల నిరుపయోగంపై సర్వే చేయాలని తహసీల్దార్ పుష్పకుమారి ఆదేశించారు. మంగళవారం ఇళ్ల స్థలాలపై వీఆర్వోలతో సమావేశం నిర్వహించారు. ఆమె మాట్లాడుతు గత ప్రభుత్వంలో జగనన్న కాలనీల పేరిట 2,245 మంది పేదలకు ఇళ్ల స్థలాలను పంపిణీ చేసిందన్నారు. అందులో ఎంత మంది ఇళ్లు కట్టుకున్నారు, ఎంత మంది ఇంకా ఇళ్లు కట్టుకుంటే వాటి దశలపై వివరాలను సేకరించాలన్నారు.

జిల్లా మలేరియా అధికారి ఆకస్మిక తనిఖీ



హాస్టల్ గదిలో దోమల నివారణ మందును పిచికారీ చేయిస్తున్న దృశ్యం

చాగలమర్రి: మండలంలోని ముత్యాలపాడు గ్రామంలోని బర్స్ ఉన్నత పాఠశాలలో పనిచేసే ఆయాకు డెంగీ నిర్ధారణ కావడంతో మంగళవారం నంద్యాల జిల్లా మలేరియ అధికారి కామేశ్వరరావు పాఠశాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. పాఠశాల ఆవరణలోని హాస్టల్, తరగతి గదులకు దోమల నివారణ మందులను పిచికారీ చేయించారు. అదే విధంగా నీరు నిలిచి ఉన్న ప్రాంతాలను గుర్తించి అబేట్ ద్రావణాన్ని పిచికారీ చేయించారు. కార్యక్రమంలో ఆళ్లగడ్డ సబ్ యూనిట్ మలేరియా అధికారి వై.శివచంద్రారెడ్డి, ఆరోగ్య విస్తరణ అధికారి జి.వెంకటేశ్వర్లు, పంచాయతీ కార్యదర్శి ఎస్.వెంకటేశ్వర్లు, ఏఎన్ఎం శుభాషిణి తదితరులు పాల్గొన్నారు.